సాక్షి నంద్యాల

శనివారం । 29 । జూలై । 2023



2 వరకు తేలికపాటి వర్షాలు

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో ఆగస్టు 2వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య ఓ ప్రకటనలో తెలిపారు.



అమ్మవారికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవి అమ్మవారికి శుక్రవారం ఊయలసేవను నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



పులి రక్షతి రక్షితః

ఆహార పిరమిడ్‌లో అగ్రభాగాన ఉన్న పులి సంరక్షణ మానవాళి మనుగడకు ఎంతో అవసరం. పర్యావరణ సమతుల్యతలో పులి పాత్ర కీలకం. నేడు టైగర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో▸

న్యూస్‌రీల్

నంద్యాల జాయింట్ కలెక్టర్‌గా రాహుల్ కుమార్‌రెడ్డి



నంద్యాల: నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జేసీగా పని చేస్తున్న నిశాంతి కుమారి గత నెల 3వ తేదీన బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జేసీ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాహుల్‌కుమార్ రెడ్డిని నంద్యాల జేసీగా బదిలీ చేశారు.

ఇంటర్‌లో ఖాళీ సీట్ల భర్తీకి 31న కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): కర్నూలు నగర సమీపంలోని దిన్నెదేవరపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 31న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంఈసీ గ్రూపులో ఎస్సీ - 24 సీట్లు, ఎస్టీ - 02, బీసీ-1, ఓసీ - 1, జూనియర్ సీఈసీ గ్రూపులో ఎస్సీ- 03, ఎస్టీ - 01, బీసీ - 01 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

తెరిపిచ్చిన వరుణుడు

- నీట మునిగిన పంటలకు తప్పిన ముప్పు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు కాసింత తెరిపినిచ్చాయి. ముసురు తగ్గి ఎండ కాయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అధిక తేమతో ఇప్పటికే సాగులో ఉన్న మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలు కొన్నిచోట్ల దెబ్బతినటం మొదలు కాబోతున్న తరుణంలో వరుణుడు కాస్త బ్రేక్ ఇచ్చాడు. దీంతో అన్నదాతలు ఎరువులు వేయటానికి, పురుగు మందులు పిచికారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పత్తి, వరి, వేరుశనగ, మొక్కజొన్న, అపరాలు, జొన్న, సజ్జ పంటల్లో రసాయన ఎరువుల వాడకంలో అన్నదాతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం సమన్వయ కర్త సరళమ్మ సూచించారు. సిఫార్సు మేరకు మాత్రమే ఎరువుల్ని వాడాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిలిచి తేమశాతం పెరగటంతో పంటలు దెబ్బతినే ప్రమాదముందని, ఈ సమస్యను ఎదుర్కొనేందుకు సాధ్యమైనంత వరకు నీటని బయటకు పంపేయటం, మోతాదు మేరకు యూరియాను వాడాలని సూచించారు. రైతులకు సందేహాలుంటే ఆర్బీకేల్లో సంప్రదించి సలహాలు పొందవచ్చని తెలిపారు.

వ్యవసాయాధికారుల విస్తృత తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాదరావు బృందం

నంద్యాల(సెంట్రల్): జిల్లా కేంద్రంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో నంద్యాల వ్యవసాయాధికారి ప్రసాదరావు బృందం ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. గత సోమవారం నుంచి శుక్రవారం వరకు పలు దుకాణాల్లో ఉత్పత్తుల నిల్వలను సోదా చేయటంతో పాటు, దస్త్రాల్ని పరిశీలించారు. సరైన అనుమతులు లేని కారణంగా న్యూ విజేత ఏజెన్సీస్‌కు సంబంధించి రూ.49,725, భారత్ పెస్ట్ కంట్రోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రూ.84,560ల విలువైన బయో స్టిమ్యులెంట్స్, పురుగు మందుల అమ్మకాల్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ... దుకాణల యజమానులు ప్రభుత్వ అనుమతులు ఉన్న ఉత్పత్తుల్ని మాత్రమే విక్రయించాలన్నారు. కొన్న సరుకుకు సంబంధించి ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలన్నారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు ఎవరైనా అమ్మితే ఎఫ్‌సీవో చట్టం-1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు ఎన్‌జీఓ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్ తెలిపారు. జిల్లా కోర్టు ఎదుటనున్న ఎన్‌జీఓ హోంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామని.. అన్ని తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. ఆగస్టు 21, 22 తేదీల్లో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయని, మొదటి రోజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మహాసభలకు సమాయత్తంపై కార్యవర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు.

మార్పు మొలకెత్తి.. సహజ సేద్యానికి జైకొట్టి!

రైతులు రసాయన అవశేషాలు లేని పంటలు పండించేలా.. వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలిస్తున్నాయి. జిల్లాలో ప్రకృతి సేద్యం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ఏటా సహజ సేద్యం సాగు విస్తీర్ణం పెరుగుతుండం శుభపరిణామం.



కసాయంతో ఎరువును తయారు చేస్తున్న రైతు



డోన్‌లో ప్రకృతి సేద్యం పద్ధతిలో సాగు చేసిన వేరుశనగ పంట

- జిల్లాలో ఏటా పెరుగుతున్న ప్రకృతి సేద్యం విస్తీర్ణం
- ఈ ఏడాది సాగు లక్ష్యం 1.05 లక్షల ఎకరాలు
- ఆర్‌బీకే పరిధిలో అవగాహన సదస్సులు
- 10 శాతం అధిక ధరతో కొనుగోలుకు టీటీడీతో ఒప్పందం

నంద్యాల: ఓ వైపు వ్యవసాయంలో రైతులు లాభాలు పొందేలా.. మరో వైపు ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సాహిస్తోంది. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో సహజ సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 2016 నుంచి ప్రకృతి వ్యవసాయం ప్రారంభం కాగా ఏడేళ్లలో ఇప్పటి వరకు దాదాపు 55 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సహజ సేద్యం విధానంలో సాగు చేసిన కూరగాయలు, పంటలు తినడంతో ఆరోగ్యం మెరుగు పడుతుండటంతో ప్రజలు కూడా ఈ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు. క్రమంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంచుతూ ప్రజల ఆరోగ్యంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడేందుకు నడుం బిగించారు. జిల్లాలో 29 మండలాల్లోని 263 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో గత ఏడాది 47,935 మంది రైతులు 56,704 ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండించారు. ఇందులో అధికంగా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేశారు.

లక్ష ఎకరాలు లక్ష్యంగా..

జిల్లాలో ఈ ఏడాది 65,159 మంది రైతులతో 1.05 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగు చేయించాలని ప్రకృతి వ్యవసాయాధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 27,930 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు అయ్యింది. అన్ని మండలాల్లోనూ ఈ విధానం ద్వారా పంటలు అందించేందుకు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకుండా నియంత్రిస్తున్నారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కూడా కేటాయిస్తుంది. ఆర్‌బీకేల పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తూ ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ప్రకృతి పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

సంవత్సరం	లక్ష్యం		అమలు చేసింది	
	రైతుల సంఖ్య	విస్తీర్ణం	రైతులసంఖ్య	విస్తీర్ణం
2016-17	3,300	3,300	3,254	3,287
2017-28	14,900	14,900	14,095	16,295
2018-19	44,350	44,350	30,549	30,863
2019-20	55,840	55,840	42,980	46,462
2020-21	64,200	79,000	64,988	79,140
2021-22	66,520	89,664	66,811	85,886
నంద్యాల జిల్లా 2022-23	62393	76,727	47,935	56,705

పంట ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్..

రసాయన ఎరువులు, మందులు లేకుండా కేవలం కషాయాలతో పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, మినుము, శనగలు, కూరగాయలు వంటివి ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలు మార్కెట్లోకి వచ్చిన వెంటనే వినియోగదారులు పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మంది ముందుగానే రైతులకు అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయ పంటలు వాడుతున్న వారు తమ ఆరోగ్యం బాగా మెరుగుపడుతుందని చెబుతుండటంతో డిమాండ్ పెరుగుతుంది. పంటలను రసాయన ఎరువులతో పడించారా.. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేశారా? అని పరీక్షలు జరిపి మరీ కొనుగోలు చేస్తున్నారు.

టీటీడీతో కొనుగోలు ఒప్పందం

జిల్లాలో రైతులు సాగు చేసిన ప్రకృతి పంటలను మద్దతు ధర్పై పది శాతం అదనపు ధరతో టీటీడీ కొనుగోలు చేస్తుంది. 2021-22లో 228 క్వింటాళ్ల కంది, శనగలు, మొక్కజొన్న, టీటీడీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది పంటలు కొనుగోలు చేసేందుకు జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారులతో ఒప్పందం చేసుకుంది.

“ టీటీడీ అధిక ధరకు కొనుగోలు చేస్తోంది



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను తిరుమల తిరుపతి దేవస్థానం అధిక ధరలకు కొనుగోలు చేస్తుంది. దీంతో ఈ ఏడాది ఆరు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖరీఫ్‌లో వేరుశనగ వేస్తున్నాను. గత ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, అంతర్‌పంటలుగా కంది, పెసర, సజ్జలు, నువ్వులు సాగు చేశాను. ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి రాగా ఎకరాకు రూ.23 వేలు ఆదాయం వచ్చింది. గత ఏడాది టీటీడీ వారికి అమ్ముకోలేకపోయా. ఈ సారి అధికారులు ముందే చెప్పడంతో మరింత లాభాలు వస్తాయని ఆశిస్తున్నా.- రామాంజినేయులు, రైతు, జలదుర్గం, ప్యాపిలి మండలం

పెట్టుబడి తగ్గించవచ్చు



2019 సంవత్సరం నుంచి ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వివిధ పంటలు సాగు చేస్తున్నాను. విత్తనం వేసినప్పటి నుంచి కోత కోసే వారకు ఎలాంటి రసాయనాలు వినియోగించడం లేదు. ప్రకృతి వ్యవసాయం విధానాలు కచ్చితంగా పాటిస్తే దిగుబడులు అధికంగా వస్తాయి. ఈ విధానంలో భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమి సారవంతం అవుతుండటంతో పంట దిగుబడి అధికంగా వస్తుంది. ఈ ఏడాది కూడా ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంలోనే పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాను.

– జయరామిరెడ్డి, చక్రవర్తుల పల్లె, చాగలమర్రి మండలం

రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని 29 మండలాల్లోని 263 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేసుకునేందుకు ప్రోత్సాహం రైతులకు అందిస్తోంది. గత ఏడాది 47,935 ఎకరాల్లో పంట సాగు అయితే ఈ ఏడాది 1.05 లక్షల ఎకరాల్లో సాగు చేయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనిపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం.

– నరేంద్రారెడ్డి, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి, నంద్యాల

వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో శుక్రవారం తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకల్లో నీటి స్థాయిని గమనిస్తు ఉండాలన్నారు. ఆర్‌అండ్‌బీ రహదారుల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపు లైన్లు, రక్షిత మంచినీటి పథకాల్లో నీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జల వనరులు, మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులు నదులో నీటి నిల్వలు, పై ప్రాంతాల నుండి వస్తున్న వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వరద నీటితో ఉప్పొంగి ప్రవహించే వాగులు, వంకలపై అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వరద ప్రాంతాల్లో పర్యటించాలని, ముంపు ప్రాంతాలు, పంటపొలాలను సందర్శించి బాధితులకు అండగా నిలవాలన్నారు. లోతట్టు, మునక ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు, సహాయ శిబిరాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండల స్థాయి, సచివాలయం స్థాయిలో కూడా సమాచార సేకరణ ఉండాలని, వలంటీర్లను అప్రమత్తం చేయాలని, మునక ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతంలో జల దిగ్బంధంలో ఉన్న ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలన్నారు. వరద బాధితుల కుటుంబానికి రూ. 2వేలు, ఒక్కరే ఉంటే రూ.1000 ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్నిచోట్లా బ్లీచింగ్ చేయాలని, హెల్త్ క్యాంప్స్ నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో పాముల బెడద ఉంటుందని కావున ప్రతి ఆసుపత్రిలో యాంటీ డోస్ మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

డీసీసీబీని అభివృద్ధి బాట పట్టిస్తాం

జగనన్న ఆశీర్వాదంతో రాజకీయంగా తొలి మెట్టు

- పీఏసీఎస్‌లకు రూ.100 కోట్లు, బ్రాంచీలకు రూ.23కోట్ల బడ్జెట్
- జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి వెల్లడి
- నూతన చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని నూతన చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. కేడీసీసీ బ్యాంక్‌తో పాటు పీఏసీఎస్‌లను కూడా లాభాల బాట పట్టిస్తామన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్‌గా బిర్లాగేట్ సమీపంలోని లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎస్వీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి తన భర్త, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ దంపతులు ఊరేగింపుగా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం కేడీసీసీ బ్యాంక్‌కు చేరుకుని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉలిందకొండ, కల్లూరు, గోనెగండ్ల సహకార సంఘాలకు రైతు నేస్తం, రాజన్న చేయూత, నందికొట్కూరు, కోడుమూరు బ్రాంచీలతో పాటు ప్రధాన కార్యాలయానికి సంబంధించి పొదుపు సంఘాలకు రూ.2 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, నాసరి వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, మూలింటి రాఘవేంద్ర, సీఈవో పి.రామంజనేయులు, డీసీఓ ఎస్.రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీసీసీబీ డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పత్తికొండ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ..

- ఎస్వీ కుటుంబానికి, కేడీసీసీ బ్యాంకుకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు.
- తన రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో డీసీసీబీ చైర్‌పర్సన్‌గా తొలిమెట్టు ఎక్కడం సంతోషంగా ఉందన్నారు.
- జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రాష్ట్రంలోనే 4వ అతి పెద్ద బ్యాంకుగా అభివృద్ధి చేస్తామన్నారు.
- డీసీసీబీ టర్నోవర్ ప్రస్తుతం రూ.3,500 కోట్లు ఉందని, దీనిని రూ.4,500 కోట్లకు తీసుకెళ్తామన్నారు.
- ఉమ్మడి జిల్లాలో 99 పీఏసీఎస్‌లు ఉన్నాయని.. రాజన్న చేయూత, రైతు నేస్తం కింద ప్రతి పీఏసీఎస్‌కు రూ.కోటి బడ్జెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు.
- కర్షకజ్యోతి కింద డీసీసీబీ బ్రాంచీలకు రూ.కోటి ప్రకారం రూ.23 కోట్లు ఇస్తామన్నారు.
- రైతులతో పాటు పట్టణవాసులకు కూడా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. అన్ని పీఏసీఎస్‌లను ఏ-కేటగిరీకి తీసుకెళ్లి, మల్టీపర్పస్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతామన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..


- 20 ఏళ్ల తర్వాత జూలైలోనే నిండిన వీఆర్ఎస్ ప్రాజెక్ట్
- చెరువులకు నీటి విడుదల
- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- 13 గ్రామాల పరిధిలో సాగు, తాగునీటి కష్టాలకు చెక్



వరద నీటితో నిండు కుండలా వరద రాజ స్వామి ప్రాజెక్ట్

ప్రాజెక్ట్ పరిధిలో చెరువుల ఆయకట్టు స్థిరీకరణ

చెరువు	ఎకరాలు
ఇందిరేశ్వరం	582
వడ్లరామాపురం	911
కరుకుంద	1,344
కొట్టాలచెర్వు	477
గువ్వలకుంట్ల	555
పాలెం	380
కొత్తపల్లి	779
బావాపురం	111



ఒక గేట్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: చెంతలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో మొన్నటి వరకు అధిక శాతం వర్షాధార పంటలే. ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన వరద రాజస్వామి ప్రాజెక్ట్‌తో సిరుల పంటలు పండుతున్నాయి. చాలా ఏళ్ల తర్వాత జూలై నెలలోనే డ్యామ్‌కు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలోని నల్లమల అటవీపరిధిలో మునిమడుగు వాగుపై ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని 18 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ కేవలం వర్షం నీటి ఆధారంగా నిర్మించారు. 13,220 ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్ట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ ప్రాజెక్ట్‌కు భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా దాదాపు 23 ఏళ్ల పాటు పనులు కొనసాగి 2000లో పూర్తయింది. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0.38 టీఎంసీలు మాత్రమే. ఇంత తక్కువ నీటితోనే 8 చెరువులను నింపి దాదాపు 13 గ్రామాల పరిధిలో 12,092 ఎకరాలకు సాగు నీటిని అందిస్తున్నారు. 20 ఏళ్ల అనంతరం తొలిసారిగా తొలి వర్షానికి ప్రాజెక్ట్‌పూర్తి స్థాయిలో నిండి జలకళ సంతరించుకుంది. నల్లమల అటవీ పరిధిలో రెండు రోజుల క్రితం భారీ వర్షం కురిసి డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో అధికారులు ప్రాజెక్ట్ ఒక గేటు తెరిచి చెరువులకు నీటిని మళ్లించారు. కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి, బావాపురం, పాలెంచెరువు, ఎం.లింగాపురం, ఆత్మకూరు మండలంలోని కురుకుంద, వడ్లరామాపురం, కొట్టాలచెరువు గ్రామాల చెరువులకు నీటని విడుదల చేశారు. ఆయకట్టులో విత్తనాలు వేసిన నెలలోపు ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల చేయడం ఇదే ప్రప్రథం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరదరాజస్వామి ప్రాజెక్ట్ పరిధిలో చెరువుల ఆయకట్టుతో పాటు కుడికాల్వ ద్వారా 317 ఎకరాలు, ఎడమకాల్వ ద్వారా 152 ఎకరాలు, వడ్లరామాపురం బ్రాంచ్‌కెనాల్ ద్వారా 3,289, వీరాపురం బ్రాంచ్ కెనాల్ 5,390 ఎకరాలు, నానాయకట్టు చెరువుల కింద 2,944 ఎకరాలు కలిపి మొత్తం 12,092 ఎకరాల భూమికి నీరు అందుతోంది.

పంట కాల్వలు అభివృద్ధి చేయాలి



ఒకప్పుడు మా ప్రాంతం కరువు ప్రాంతం. పంటలు పండాలంటే వర్షం కురవాల్సిందే. అలాంటి భూముల్లో బంగారు పంటలు సాగు చేసే అవకాశం వచ్చింది. వరద రాజ స్వామి ప్రాజెక్ట్ నిర్మాణంతో చుట్టూ గ్రామాల్లో చాలా మార్పు వచ్చింది. ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉంటే రెండు పంటలు కూడా సాగు చేస్తాం. పంట కాల్వలు అభివృద్ధి చేస్తే చివరి భూములకు సైతం నీరందుతోంది.

– శేషిరెడ్డి, రైతు వడ్లరామాపురం

సాగునీటిని వృథా చేయొద్దు



ప్రస్తుతం ఈ ఏడాది రైతులకు ముందస్తుగానే సాగు నీరు అందిస్తున్నాం. ఈ నీటిని రైతులు సక్రమంగా వినియోగించుకుని పంటలు పండించాలి. నీటిని వృథా చేయకుండా కాల్వల ద్వారా ఎప్పటికప్పుడు పొలాలను తడపాలి. రైతులు డ్యామ్ నీటిని పొదుపుగా వాడుకుంటే రెండో పంటను సైతం సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

– నాగన్న, నీటిపారుదల శాఖ ఏఈ, ఆత్మకూరు

క్లుప్తంగా

వైఎస్సార్ అవార్డుకు 'చేనేత' ప్రతిపాదనలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డు కోసం ఎమ్మిగనూరు వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ పేరును జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఈ అవార్డు కోసం సొసైటీకి ఉన్న నేపథ్యం, సాధించిన ప్రగతి, లభించిన అవార్డులు, పురస్కారాలు తదితర వాటిని వివరిస్తూ నివేదిక పంపారు. 1938లో రూ.170 షేర్ క్యాపిటల్‌తో 20 మంది సభ్యులు, 25 మగ్గాలతో మాచాని సోమప్ప సొసైటీని ప్రారంభించారు. కాలక్రమంలో ఈ సొసైటీ 2500 మంది సభ్యులు.. దాదాపు 3000 మగ్గాలతో విస్తరించింది. ఈ సొసైటీకి గోల్డ్‌ప్లేట్ అవార్డుతో పాటు అనేక పురస్కారాలు, నగదు అవార్డులు కూడా లభించాయి. సంఘానికి 17 అవుట్‌లెట్స్ కూడా ఉన్నాయి. చేనేత పరిశ్రమను ఈ సొసైటీ బతికిస్తూ వస్తోంది.

రూ.16లకే గోధుమ పిండి

కర్నూలు(సెంట్రల్): ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు రూ.16లకే కేజీ ఫోర్టిఫైడ్ గోధుమ పిండి అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై నుంచి ఎండీయూ వాహనాల ద్వారా గోధుమ పిండిని జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అందిస్తున్నామన్నారు. ఆయా మున్సిపాలిటీల్లో 2.5 లక్షల మంది వినియోగదారులు ఉంటే కేవలం 28,082 మంది మాత్రమే గోధుమ పిండి తీసుకున్నారన్నారు. ఆగస్టు నుంచైనా వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. త్వరలోనే రేషన్‌కార్డుదారులందరికీ గోధుమ పిండిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు.

30న సాంఘిక నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నెలనెలా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 30న సాంఘిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో 30వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో 'అతీతం' నాటక ప్రదర్శన, రాత్రి 8 గంటలకు అద్దెపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో 'థ్యాంక్స్ ఫర్ ది పీఎం' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. నాటక ప్రియులందరూ హాజరు కావాలన్నారు.



పులి రక్షతి రక్షితః

అందంలోనూ.. బలంలోనూ.. పెద్ద పులికి సాటిరాగల మరో జంతువు భూమిపై కనిపించదు. అది నడుస్తుంటే రాజసం తొణికిసలాడుతుంది. మనిషి క్రూరత్వం బారిన పడుతూ చివరకు భూమిపై అంతరించి పోతున్న జాతుల జాబితాలో చేరి రెడ్ డాటా బుక్‌లో పులి పేరు చేరడం మానవ మనుగడకే ప్రమాదకరం. ఈ అపురూపమైన పులిని సంరక్షిస్తే అది పర్యావరణ అభివృద్ధికి ఎంతో దోహద పడుతుంది. నేడు (శనివారం) టైగర్స్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం. – ఆత్మకూరు రూరల్

- టైగర్'ఘర్'గా విరాజిల్లుతున్న నల్లమల
- ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో 73కి పైగా పులులు
- శ్రీశైలం – శేషాచలం కారిడార్‌కు ప్రయత్నాలు
- నేడు అంతర్జాతీయ పెద్దపులుల దినోత్సవం

భూమిపై మానవ మనుగడ సజావుగా సాగడానికి భూ విస్తీర్ణంలో కనీసం 33 శాతం అడవులు ఉండాలి. కాని ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా ఈ పరిస్థితి లేదు. అందుకే పర్యావరణాన్ని కాపాడేందుకు అన్ని ప్రభుత్వాలు అనేక మార్గాలు అన్వేషిస్తున్నాయి. మనదేశంలో పర్యావరణ పిరమిడ్‌కు పెద్ద పులిని అగ్ర సూచిగా గుర్తించి ఆ మేరకు పర్యావరణాన్ని అభివృద్ధి పరుస్తున్నారు. పులికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, పులి ఆహార జంతువుల సంఖ్య పులుల నిష్పత్తితో తగ్గకుండా చూడడం, పులి ఆహార జంతువుల కోసం గడ్డి మైదానాలను విస్తరించడం, పులి విహారానికి ఆటంకం కలుగకుండా అడవుల్లో మానవ సంచారాన్ని నియంత్రించడం వంటి పలు చర్యలు చేపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం పెద్ద పులుల సంఖ్య 4 వేలు మాత్రమే ఉండగా వాటిలో 75 శాతం ఒక్క భారత దేశంలోనే 3,167గా ఉండడం గమనార్హం. ఏటా పులుల సంఖ్య రేటు 6 శాతం పెరుగుతుండడం విశేషం. ఇటీవల ప్రకటించిన చత్తీస్‌ఘడ్‌లోని గురుదాసిదాస్ టైగర్ రిజర్వ్‌తో కలిపి భారత దేశ వ్యాప్తంగా మొత్తం 53 పెద్ద పులుల అభయారణ్యాలున్నాయి. విస్తీర్ణం రీత్యా రెండు తెలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న నాగార్జున సాగర్ శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) దేశంలోనే అతి పెద్దది (3568 చ.కి మీ). 2022 – 23 అధికారుల అంచనా మేరకు ఎన్ఎస్‌టీఆర్‌లో 73 – 78 పులులు ఉండవచ్చు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. అటవీ సిబ్బంది పర్యవేక్షణ, మానవ వనరులను అత్యంత ప్రతిభావంతంగా వినియోగించుకోవడం వంటి అంశాల కారణంగా ఇక్కడ పులులు క్రమేపి పెరుగుతున్నాయి. 2014లో ఈ అంశాలపై ఎన్‌టీసీఏ అత్యున్నత ప్రతిభా అవార్డును అప్పటి ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ రాహుల్ పాండే అందుకున్నారు.

పులుల సంరక్షణ ఎంతో అవసరం



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి సంరక్షణ ఇమిడి ఉంది. పులికోసం తీసుకునే సంరక్షక చర్యలు యావత్తు పర్యావరణ రక్షణకు ఉపకరిస్తాయి. పులి ఆవాసం, ఆహారం, నీటి వనరులను సంరక్షించడంతో అటవీ ప్రాంతాన్ని సుభిక్షంగా ఉంచవచ్చు. అందుకే పులి పర్యావరణ అగ్రసూచిగా చెప్పుకుంటాం. ఈ సందర్భంగా పులికి పర్యావరణ పరిరక్షణలో ఉన్న ప్రాముఖ్యాన్ని ప్రచారం చేస్తున్నాం. పులి సంరక్షణలో నైపుణ్యాలను మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

– పట్టాభి, ఎఫ్ఆర్‌వో, ఆత్మకూరు

లెక్క పక్కాగా..



పెద్ద పులుల పాద ముద్రలు సేకరించి వాటి ఆధారంగా పులు సంఖ్యను అంచనా వేయడాన్నే స్టాండర్డ్ పగమార్క్ ఎన్యూమరేషన్ పద్ధతిగా పిలుస్తారు. పులుల అంచనాకు పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకుంటున్నారు. అడవుల్లో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిల్లో పడే చిత్రాల ఆధారంగా పులుల చారలను విశ్లేషిస్తారు. వీటి ఆధారంగా వాటికి పేర్లు పెట్టి పర్యవేక్షిస్తుంటారు.

పులి సామ్రాజ్యం విస్తరించేలా..

నల్లమలలలోని శ్రీశైలం నుంచి శేషాచలం అడవుల వరకు పెద్దపులి ప్రస్తానం కొనసాగాలని ఆకాంక్షించిన అటవీ అధికారులు ఆదిశగా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీశైలం, గుండ్ల బ్రహ్మేశ్వరం, నంద్యాల అటవీ డివిజన్, రుద్రవరం రేంజ్, వైఎస్సార్ జిల్లా లంకమల వరకు పెద్దపులుల ప్రస్తానం కొనసాగింది. ఈ నేపథ్యంలో పులులు స్వేచ్ఛగా సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లడానికి తగిన వసతులు కల్పించడమే శ్రీశైలం – శేషాచలం పెద్దపులుల కారిడార్ ఆలోచనకు నాంది పలికి ఆ మేరకు చర్యలు చేపడుతున్నారు.

ఏకాంతానికి అనుకూలంగా..

పులుల సమాగ సమయమైన జూలై మొదటి వారం నుంచి సెప్టెంబర్ చివరి వారం వరకు అడవుల్లో జన సంచారాన్ని అటవీ శాఖ నిలుపుదల చేసింది. గిరిజనులు కూడా ఈ సమయాల్లో చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కోసం అడవుల్లో తిరగకుండా చర్యలు చేపట్టారు. బైర్లూటీ నల్లమల జంగిల్ క్యాంప్, పచ్చర్ల, తుమ్మల బయలు ఎకో టూరిజం రిసార్ట్స్‌లో ఆన్‌లైన్ బుకింగ్ నిలిపి వేశారు. అంతే కాకుండా దట్టమైన అడవుల్లో ఉన్న ఇష్టకామేశ్వరి, నాగలూటి వీరభద్రాలయం, రుద్రకోడు, గుండ్ల బ్రహ్మేశ్వరానికి వెళ్లే భక్తులకు అటవీ ప్రవేశం నిలిపివేశారు.

ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పులుల సంఖ్య పెరుగుదల ఇలా..

సంవత్సరం	పులుల సంఖ్య
2014 – 15	37
2015 – 16	40
2016 – 17	46
2017 – 18	46
2018 – 19	47
2019 – 20	63
2020 – 21	70
2022 – 23	78 (అంచనా)

పులి విశేషాలు

- పులి మనిషిని వాసన ద్వారా గుర్తించి అతని కంట పడకుండా తప్పుకు తిరుగుతుంది. ఆహారం కోసం పులి ఎపుడు మనిషిపై దాడి చేయదు. (ఏదో కారణంగా గాయ పడి వేటాడలేని దుస్థితిలో, వృద్ధాప్య స్థితిలో అరుదుగా మనుషులను ఆహారం కోసం చంపిన ఘటనలున్నాయి).
- ఇది చాలా సిగ్గరి జంతువు. పులుల సంగమ సమయంలో మనిషి అలికిడి విన్నా చాలు అవి వెంటనే సమాగం నుంచి దూరమవుతాయి. లేత గర్భంతో ఉన్న ఆడపులులకు మానవ కలకలం వినపడినా సరే బెదురుతో గర్భస్రావం అవుతుంది.



- పులి కనీసం 10 నుంచి 20 సార్లు వేటాడటం ప్రయత్నిస్తే ఒకసారి మాత్రమే వేట జంతువును చంపగలుగుతుంది. తన బరువుకంటే రెట్టింపు బరువు ఉండే ఆవులు, బర్రెలను మెడ పట్టుకుని చాలా సునాయాసంగా పొదల్లోకి ఈడ్చుకు వెళుతుంది. సంవత్సరానికి ఒక పులి 50 నుంచి 60 జంతువులను తన ఆహారం కోసం వేటాడుతుంది.
- సాధారణంగా ఒక మగ పులి తన ఆహార లభ్యతను బట్టి తన విహార ప్రాంతాన్ని గుర్తిస్తుంది. నల్లమలలో ఒక పులి సాధారణంగా తన ఆధీన ప్రాంతం(టెరిటరీ) 50 చ.కి.మీ గా ఉంచుకుంటుంది. అయితే తన భాగస్వామి కోసం, ఆహారం కోసం 200 చ.కిమీ పరిధి వరకు విహరిస్తుంది.

వైమానిక దళంలో రిక్రూట్‌మెంట్‌పై అవగాహన



వైమానిక దళంలో ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

కర్నూలు(రూరల్)/కర్నూలు కల్చరల్: భారత వైమానిక దళంలో రిక్రూట్‌మెంట్‌పై శుక్రవారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియం, బీ తాండ్రపాడులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులకు సికింద్రాబాద్ ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్ నుంచి నాన్ కమిషనర్ ఆఫీసర్లు రాజేష్, అరుణ్ గోస్వామి, సునిల్ దాసు హాజరయ్యారు. దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ తదితర వాటి గురించి వివరించారు. అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఈ నెల 27 నుంచి ఆగస్టు 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇంటర్(ఎంపీసీ), మూడు సంవత్సరాల డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు.పూర్తివివరాలకుhttps://agnipathvayu. cdac.in ను సంప్రదించాలన్నారు. సెట్కూర్ సీఈఓ రమణ, పాలిటెక్నిక్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవిఎస్ఎస్ఎన్‌ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందు బాబులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు, దావీదు, నాగరాజుకు ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అలాగే పోల్‌రెడ్డికి పది రోజులు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. పట్టణంలో విశ్వనగర్‌లో మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరనంగా ప్రవర్తించించిన వెంకటరమణ అనే వ్యక్తికి 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు.. మోటార్ సైకిల్ ఢీ

- ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు, గాయపడ్డ గోవర్ధన్, లింగారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పట్టణం సమీపంలోని కర్నూలు బైపాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదోనికి చెందిన లింగారెడ్డి (బీటెక్ థర్డ్ ఇయర్), గోవర్ధన్ (బీటెక్ ఫస్టియర్) చదువుతున్నారు. రోజూ బైక్‌పై ఆదోని నుంచి కాలేజీ వచ్చి వెళ్తుంటారు. అందులో భాగంగా శుక్రవారం ఆదోని నుంచి కొత్త స్పోర్ట్స్ బైక్‌పై లింగారెడ్డి, గోవర్ధన్‌లు కాలేజీకి వస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు రోడ్డ్ షాదీఖానా దగ్గర కర్నూలు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, మోటారు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో విద్యార్థులను కర్నూలుకు తరలించారు. లింగారెడ్డి అనే విద్యార్థి కోమాలో ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఏఎస్ఐ నటరాజ్, హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- విస్తృతంగా మొక్కలు నాటాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(అగ్రికల్చర్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు నడుం బిగించాలని సూచించారు. శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగన్నాథగట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థకు చెందిన డీసీబీసీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ సృజన, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ, ఆయన సతీమణి అనూహ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అక్కడ ఇదివరకే నాటిన మొక్కలను, పచ్చదనాన్ని కలెక్టర్ పరిశీలించారు. డీసీబీసీలోని వనాలకు కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నామని, పనస పండ్ల చెట్లను కూడా పెంచనున్నట్లు డ్వామా పీడీ అమరనాథరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సీతాఫలం, కానుగ, టేకు ఇలా 1200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. ఆలూరు, బనవాసి, కాల్వబుగ్గల్లోని నర్సరీల్లో 6 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఆసుపత్రుల ప్రాంగణాలు, చెరువులు, చేలగట్ల వెంట మొక్కలు నాటడంపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్గానిక్ పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు పండించి మిల్లెట్ కేఫ్ తరహాలో ప్రత్యేక కౌంటరులో విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, డీఎఫ్‌వో శివశంకర్‌రెడ్డి, డీపీవో నాగరాజునాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి మట్టి పోస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

విద్యుత్ కంట్రోల్ రూం ఏర్పాటు

- అత్యవసర సేవల కోసం 7382614308 నంబరుకు ఫోన్ చేయండి



కర్నూలు(రాజ్‌విహార్): భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్ ఇంజినీర్లను పర్యవేక్షణ కోసం నియమించినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు పడుతున్న సమయాల్లో సొంతంగా పనులు చేసుకోవడం తగదని, విద్యుత్ సిబ్బంది సేవలు పొందాలని సూచించారు. అత్యవసర సమయాల్లో కర్నూలు, నంద్యాల జిల్లా వినియోగదారులు 7382614308 నంబరుకు ఫోన్ చేసి సేవలు పొందవచ్చని సూచించారు.

ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్



లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్

నంద్యాలటౌన్: జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవకుమార్ తెలిపిన వివరాల మేరకు.. డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో తప్పెట నాగాంజనేయులు డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం జీపీఎఫ్ ఫైనల్ బిల్లు కోసం వైద్యాధికారులను సంప్రదించాడు. వారు సీనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్‌ను కలవాలని సూచించారు. తనకు సంబంధించిన ఫైలును ఉన్నతాధికారుల వద్దకు పంపాలంటే రూ.6 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అసలే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నాగాంజనేయులు లంచం ఇచ్చుకోలేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14400కు కాల్ చేసి జరిగిన విషయాన్ని వివరించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవకుమార్, సీఐలు తేజేశ్వరరావు, వెంకట కృష్ణారెడ్డి, వంశీనాథ్, ఇంతియాజ్‌లు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వలపన్ని అశోక్ కుమార్‌కు బాధితుడు రూ.6 వేలు లంచం ఇస్తుండగా నేరుగా పట్టుకున్నారు. నగదుతో పాటు అశోక్ కుమార్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామని దేవకుమార్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14400కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

హోమ్‌గార్డు కుటుంబానికి రూ.30 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు

బొమ్మలసత్రం: విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన హోమ్‌గార్డు రాజశేఖర్ కుటుంబానికి జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి రూ.30 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో రాజశేఖర్ మృతి చెందిన తర్వాత ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పరిహారాలను అందించామని వివరించారు. అలాగే రాజశేఖర్ భార్యకు హోమ్ గార్డు ఉద్యోగం కల్పించామన్నారు. మృతిచెందిన రాజశేఖర్‌కు స్థానిక యాక్సిస్ బ్యాంక్‌లో శాలరీ ప్యాకేజీ అకౌంట్ ఉండటంతో బ్యాంక్ నిబంధనల ప్రకారం మృతి చెందిన వ్యక్తికి రూ.30 లక్షల ఇన్సూరెన్స్ డబ్బుతో పాటు, ఆడపిల్ల ఉన్నందున మరో రూ.8 లక్షలు అందించారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో హోమ్‌గార్డు కమాండెంట్ మహేష్, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముణి, యాక్సిస్ బ్యాంక్ ఉద్యోగి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



హోమ్‌గార్డు కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది



నింగి పురివిప్పి.. ప్రకృతి నాట్యమాడి!

ప్రకృతి పరవశించి ఆడుతుంటే చూసేందుకు రెండు కళ్లు చాలవు. నీలి ఆకాశం మబ్బులను మోసుకొస్తుంటే.. చినుకు రాలే క్షణం కోసం పైరు గాలితో జతకట్టింది. తనువంతా నీటితో నిండిన చేను నింగి మేఘాలతో 'పచ్చని' పాట పాడుతోంది. వర్షించిన ఆశలకు పుడమి పరవశిస్తుంటే.. కమ్ముకొస్తున్న కారుమబ్బు కరిగి పోయేందుకు తపిస్తున్న దృశ్యం మహానంది మండలంలోని మసీదుపురం వద్ద శుక్రవారం ఆవిష్కృతమైంది.

– మహానంది



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ Regular/ Distance/ Discountinued/ Direct final Year 10th, 12th, Diplima, B.Tech, M.Tech, BA, B.Com, BSC, MA, M.Com, MSC, BSW, BLIC, BBA, BCA, LLB, MLT, DMLT, Anastisha, OT, MPHW, ANM, GNM, MBA, MCA, AGBSC, PHD, KNL. 86861 72989 [L-787375]

COACHING

■ నవోదయ, సైనిక్ పాఠశాలలో 6th ప్రవేశ పరీక్షల కొరకు 8th, 10th విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ శ్రేష్ఠ, యశస్వి పరీక్షల కొరకు కోచింగ్ ఇవ్వబడును. తరగతులు ఆగస్టు 1 నుంచి ప్రారంభం. హాస్టల్ వసతి కలదు. సంప్ర: 94939 02958 [L-787383]

DISTANCE DEGREE & PG

■ Degree: B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLiSc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLiSc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410 [L-787378]

■ ఇంటర్ ఫెయిలయ్యారా ! చింతించవద్దు – Join Inter One Sitting. Govt. Recognised Board. Exams : October - 2023. (C) Vijayawada : 89774 25849, 91333 40140 [V. 2033]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1496]

REAL ESTATE

■ గణేష్ నగర్‌లో Flat 25 లక్షల మొదలు & ఫుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గర 3BHK హౌస్, డూప్లెక్స్ హౌస్ & సాయికృష్ణ డిగ్రీ కాలేజ్ దగ్గర ఓపన్ ప్లాటు 22 లక్షలు అమ్మబడును. 90145 80500 [L-787356]

PLOT FOR SALE

■ ప్లాట్లు, ప్లాట్లు, ప్లాట్లు ప్రకృతి రియల్ ఎస్టేట్ న్యూ వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ కలవు. అతి తక్కువ ధరలకే అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్. 100% టైటిల్ క్లియర్. సెల్: 94401 58901 [L-787357]

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) ప్లాటు కేవలం 3 లక్షలు మాత్రమే. EMI సౌకర్యం కలదు. సంప్ర: నితిక డెవలపర్స్, 98884 24222 [L-787373]

FLAT FOR SALE

■ భార్గవ టవర్స్ 3BHK అపార్ట్‌మెంట్స్ కర్నూలు. బళ్ళారి చౌరస్తా దగ్గరలో 1484 SFTలో లగ్జరీ ఫ్లాట్స్, కారు పార్కింగ్, అన్ని సౌకర్యాలతో అమ్మబడును. సంప్ర: 91828 21014 [L-787382]

HOUSE FOR SALE

■ Kuda Approvalతో గణేష్ నగర్‌లో Padma's Residency అపార్ట్‌మెంట్‌లో 1,2,3 BHK Flats & ఫుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 77 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & సూటిదిక్కపల్లి రోడ్‌కి సూపర్ లగ్జరీహౌస్ అమ్మకమునకు కలవు. 90143 35313 [L-787355]

■ APOORVA BUILDERS. Premium ready to move in houses with interiors in gated community Bank Loan Available. Cell: 81215 87551 [L-787364]

■ కర్నూలు–బిర్లాగేట్ దగ్గరలో స్కంద ఆఫీస్ వెనుక ఎండోమెంట్ కాలనీలో తూర్పు ఫేస్ 5 1/2 సెంట్లలో 2 ఫ్లోర్స్ మరియు వాచ్‌మెన్ రూం గల Approved LP No. House అమ్మకానికి కలదు. Fixed Rate 1.20 Crores. సంప్ర: 79955 44946 [L-787379]

TO - LET

■ కర్నూలు బాబా బృందావన్ నగర్, స్టేట్ బ్యాంక్ కాలనీ, గ్రౌండ్ & 1st ఫ్లోర్, డబుల్ బెడ్ రూమ్స్, 2 కార్ పార్కింగ్స్ గల ఇల్లు అద్దెకు కలదు. 79932 91597, 99851 98286 [L-787221]

SERVICES

ASTROLOGY

■ శ్రీ వైదీశ్వరన్ కోవిల్ నాడీ జ్యోతిష్యాలయం. మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. పాతబస్టాండ్, కర్నూలు. 83092 09485. [L-787240]

■ విద్య, ఇంటి, వ్యాపార, ప్రేమ వివాహం, ఆరోగ్య సమస్య ఒక్క కాల్‌తో అన్ని సమస్యలకు పరిష్కారము బాబా MS ఖాన్. Hyd. Ph: 9652149253 [H-189270]

MARRIAGE SERVICES

■ స్టార్ ముస్లిం మ్యారేజ్ బ్యూరో నంద్యాల బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రైవేటు, టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, ఆర్మీ, డాక్టర్ సంబంధాలు కలవు. సంప్ర: 87908 44959 (2వ సంబంధాలు కలవు) [L-787374]

WANTED

■ కర్నూలు నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ నందు అటెండర్‌గా పని చేయుటకు పురుష అభ్యర్థులు కావలెను. సంప్ర: 98854 85281, 99593 62229 [L-787380]

■ Wanted Teachers to Teach 4th to 10th Hindi, 10th Physics. Part time & Warden (Male). Contact: R.R.High School, KNL. 94402 90162, 94416 11995 [L-787245]

■ కర్నూలు జిల్లా కాల్వబుగ్గ దగ్గరలోగల మసురం ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 12,000/– రూము+భోజనం కలదు. అర్హత: 10th P/F సంప్ర: 95817 76921, 95817 76923 [L-1215690]

■ కర్నూలు నగరంలోని విద్యాసంస్థ నందు బోధించుటకు B.Sc. నర్సింగ్ పూర్తి చేసిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర: 99593 62229, 90105 01799 [L-787381]

■ Wanted Experienced Teachers to teach all subjects for higher classes. contact : 94939 02958 [L-787377]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీసు అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్లు: 10th - డిగ్రీ, జీ: 25,000/-. 9642252949 [G-7455]

■ ప్రముఖ గ్లోబల్ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221346]

■ కర్నూలులో కొత్తగా ప్రారంభం అయిన ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్స్, బ్రాంచి మేనేజర్స్ M/F కావలెను. Q:Inter, Age:18-25, Sal: 18000/- ఫ్రీ ఫుడ్ ఫ్రీ రూం కలదు. ✆ 8985249193 [G-855]

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 13000/– ఉచిత వసతి, భోజనం, ఫోన్ : 6300661014 [HA-369]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7995984445 [HA-452]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.